TGTEL/25/A1132

ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

మానవాళికి

# జనం వార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..



'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | సోమవారం | 29.06.2026 | సంపుటి : 1 | సంచిక : 349 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

### అధికారంలోకి వచ్చాక
# వడ్డీతో సహా చెల్లిస్తాం



**స్పీకర్ పోలీసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారు**

**మోదీ అంటే రేవంత్‌కు భయం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

వికారాబాద్, జూన్ 28: స్పీకర్.. సీఎం..ఇక్కడి ఎమ్మెల్యేలు ప్రాజెక్టుల పేరిట రైతుల భూములు కొల్లగొడుతున్నారని, బాధిత రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణం లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అధ్యక్షతన సర్, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా -మిగతా 2 లో..





యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆదివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శనానికి పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. క్యూ లైన్లో భక్తులు బారులు తీరారు. ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంట సమయం పడుతోంది. ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. నిత్య కల్యాణం, లడ్డూ ప్రసాదం కౌంటర్లు, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద కల్యాణ కట్ట, పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.



### ఉద్రిక్తతలకు
# ఇక ముగింపు

**దాడులు ఆపాలని నిర్ణయించుకున్న అమెరికా, ఇరాన్**

వాషింగ్టన్, జూన్ 28: వరుస దాడులతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు పెంచిన అమెరికా, ఇరాన్‌లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇటీవల కుదిరిన ఒప్పందం కొనసాగడంపై నీలినీడలు కమ్ముకున్న నేపథ్యంలో ఇరు దేశాలు పరస్పరం దాడులు ఆపాలని నిర్ణయించాయి. ఖతార్ వేదికగా మంగళవారం ఉన్నతస్థాయి చర్చలు జరపాలని నిర్ణయించుకున్నట్లు యాక్సియోస్ వార్తాసంస్థ తెలిపింది. ఇటీవల కుదిరిన ఒప్పందాన్ని కాపాడుకునేందుకు ఇరుదేశాలు చొరవ చూపినట్లు పేర్కొంది. యాక్సియోస్ ప్రకారం.. హర్మూజ్ విషయంలో చర్చలు కొనసాగుతున్నంత కాలం దాడులు చేసుకోవద్దని ఇరు దేశాలు నిర్ణయం తీసుకున్నాయి. మిలిటరీ కార్యకలాపాలను తక్షణమే ఆపేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు అమెరికా సీనియర్ అధికారులు పేర్కొన్నారు. హర్మూజ్ విషయంలో సాంకేతిక చర్చలు జరుగుతున్నప్పటికీ..

- మిగతా 2 లో..

# మూసీ ప్రక్షాళన తథ్యం

**కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారు**

**మూడు పార్టీల పాలనపై రచ్చబండలో చర్చ పెట్టండి**

**ఏం త్యాగాలు చేశారని భారాసను ప్రజలు కోరుకుంటున్నారు**

**నల్గొండ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

**రూ.13,006 కోట్లతో 6,092 కి.మీ. హ్యామ్ రోడ్ల పనులకు భూమి పూజ**

**తెలంగాణ కోసం ఎవరేమిచేశారో శాసనసభలో మాట్లాడదాం**

పదేళ్లు పదవులు అనుభవించి రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు శాశ్వతంగా బహిష్కరించారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంతోమంది త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధిస్తే.. పదవులు మాత్రం కేసీఆర్ కుటుంబం అనుభవించిందని విమర్శించారు. ఆ కుటుంబానికి మళ్లీ అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. నల్గొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నాగార్జున కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.



నల్గొండ, జూన్ 28: "ఎన్ని ఆటంకాలు ఎదురైనా దేశానికి తలమానికంగా మూసీని ప్రక్షాళన చేస్తాం. కాలుష్యం నుంచి నల్గొండ బిడ్డలకు విముక్తి కలిగిస్తాం. ఒట్టేసి చెబుతున్నా. మూసీ ప్రక్షాళన తథ్యం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర నిర్మించనున్న 441 హ్యామ్ రోడ్ల పనులకు సీఎం ఆదివారం నల్గొండ జిల్లా కనగల్‌లో భూమి పూజ చేశారు. పైలాన్‌ను ఆవిష్కరించారు. నల్గొండ కార్పొరేషన్‌లో రూ.83 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకం పనులకూ శంకుస్థాపన చేశారు. తర్వాత నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. "బావబామ్మరిది కలిసి తిరుగుతున్నారు. భారాస ప్రభుత్వం రావాలని ప్రజలు -మిగతా 2 లో..



### బెంగాల్ తరహా పోరాటాలకు
# సిద్ధం కావాలి

**బీజేపీ నేతలు, కార్యకర్తలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపు**

**వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ధీమా**

**తమ నేతలు పోరాటాలు చేస్తే.. కాంగ్రెస్ మోసపూరితంగా గద్దెనెక్కిందని వ్యాఖ్య**

**9 జిల్లాల పార్టీ కార్యాలయాల ప్రారంభోత్సవం**

హైదరాబాద్, జూన్ 28: తెలంగాణలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్ర వికాసం సాధ్యమవుతుందన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నూతనంగా నిర్మించిన రంగారెడ్డి జిల్లా రూరల్ పార్టీ కార్యాలయ భవనాన్ని ఆదివారం కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావులతో

-మిగతా 2 లో..

### వర్షం వచ్చినా
# సభ ఆగదు


**రెండున్నరేళ్లలో చేపట్టిన పనులను రైతులకు వివరిస్తాం**

**బీఆర్ఎస్ నేతలు పొర్లుదండాలు పెట్టినా ప్రజలు క్షమించరు**

**సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి**

**సభాప్రాంగణంలోకి వర్షపు నీరు.. నేటి రైతుమేళా రద్దు**

అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈ వివరాలను 30వ తేదీన చింతకాని మండలం మత్కేపల్లిలో జరిగే రైతు ఆశీర్వాద సభలో వివరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా మత్కేపల్లిలో జరిగే రైతు ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఆదివారం మంత్రి పరిశీలించారు.



చింతకాని, జూన్ 28: వర్షం వచ్చినా సభ రెట్టింపు ఉత్సాహంతో జరుగుతుందని.. తమ పథకాలు కూడా అదే స్థాయిలో అమలవుతాయని పొంగులేటి తెలిపారు. దేశంలోనే అత్యధిక ధాన్యాన్ని రాష్ట్ర రైతులు పండించినా మద్దతు ధరతో కొనుగోలు చేసి వారంలో డబ్బు జమ చేశామన్నారు. బీఆర్ఎస్ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన సాగునీటి ప్రాజెక్టులను కూడా పూర్తి చేస్తున్నామని, రహదారుల నిర్మాణానికి పెద్దమొత్తంలో నిధులను ప్రభుత్వం మంజూరు -మిగతా 2 లో..



### చిన్నారుల బంగారు భవితకు
# పోలియో చుక్కలు

**రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

హైదరాబాద్, జూన్ 28: చిన్నారుల బంగారు భవితకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. ఆదివారం జాతీయ పల్స్ పోలియో దినం సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం బోరబండ యూపీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 42 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించామన్నారు. 229 పోలియో బూత్‌లను, 903 మొబైల్ ట్రాన్సిట్ పాయింట్లలో బృందాలను ఏర్పాటు చేశామన్నారు. 2,298 మంది రూట్ సూపర్‌వైజర్లు, 8,393 మంది ఏఎన్ఎంలు, 27,181 మంది ఆశా కార్యకర్తలు, 34,442 మంది

-మిగతా 2 లో..

### సీఎం రేవంత్‌కు
# భయం పట్టుకుంది

**మిస్టర్ రేవంత్.. రోజులు లెక్కపెట్టుకో**

**దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయండి**

**ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం**

**సింగరేణి టెండర్ బాగోతాలపై చర్చకు సిద్ధమా?**

**నల్లగొండ సభలో సీఎం రేవంత్‌వి అన్నీ అబద్ధాలే**

**: మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్**



సిద్దిపేట, జూన్ 28: 'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ అంటే భయం పట్టుకుంది. నిద్రలో కూడా వణుకు మొదలైంది. ఆయన చెప్పకనే చెబుతున్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుంది. ఆయన తప్పులు చేశారు. ప్రజలంతా బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు అని అర్థమైంది. అందుకే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. మిస్టర్ రేవంత్‌రెడ్డి.. రోజులు లెక్కపెట్టుకో..ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు'అని మాజీ మంత్రి హరీశ్‌రావు

-మిగతా 2 లో..



## బెంగాల్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ప్రారంభించారు. అక్కణ్నుంచే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నిర్మించిన పార్టీ కార్యాలయ భవనాలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల బూత్ కమిటీల బాధ్యుల సమావేశంలో ప్రసంగించారు. ఆయా కార్యక్రమాల్లో నితిన్ నబీన్ మాట్లాడుతూ..కాంగ్రెస్‌తోపాటు ప్రాంతీయ పార్టీల అవకాశవాద రాజకీయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రాన్ని కేవలం అధికారాన్ని అనుభవించే సాధనంగా మార్చుకున్న పాలకులను గద్దె దించే శక్తి భాజపా కార్యకర్తలకు మాత్రమే ఉందన్నారు. భారాస ప్రభుత్వ వైఫల్యాలపై భాజపా కార్యకర్తలు, నేతలు పోరాడితే..ఆ పోరాట ఫలాన్ని మోసపూరితంగా పొందడం ద్వారా కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని ఆక్షేపించారు. ఎన్నో పోరాటాలతో పశ్చిమబెంగాల్‌లో కమలం వికసించిందని, తెలంగాణలోనూ అదే పునరావృతం కాబోతుందని నితిన్‌నబీన్ ధీమా వ్యక్తంచేశారు. 'తెలంగాణలో భాజపా కేవలం నగరాలకే పరిమితం కాలేదు. పల్లెపల్లెకు విస్తరిస్తోంది. ఒకేసారి 9 జిల్లా కార్యాలయాలు అందుబాటులోకి రావడం అందుకు నిదర్శనం' అని పేర్కొన్నారు.



## వర్షం వచ్చినా సభ ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోందని తెలిపారు. పదేళ్ల కాలంలో ప్రజా, రైతు సంక్షేమాన్ని విస్మరించిన బీఆర్ఎస్ నేతలను ప్రజలు తిరస్కరించగా.. 30న జరిగే సభకు వచ్చే లక్షలాది మంది రైతులు, జనాన్ని చూస్తే బీఆర్ఎస్ నేతల గుండె పగలడం ఖాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు పాదయాత్ర చేసినా, పొర్లుదండాలు పెట్టినా కారు కూతలు కూస్తున్న వారిని ప్రజలు క్షమించబోరని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను పరిశీలిస్తే వచ్చే ఎన్నికల్లోనూ వారి ఓటమిని స్వీకరించినట్టు తెలుస్తోందని చెప్పారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు.. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడతలో ఇచ్చిన ఇళ్లలో 25 శాతం కూడా లేవన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రమోహన్, డైరెక్టర్ గోపి, కలెక్టర్ దివాకర టీఎస్, సీపీ సునీల్‌దత్, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, కనకయ్య, రాగమయి పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం గంట పాటు కురిసిన భారీ వర్షానికి సీఎం సభాప్రాంగణం నీటితో నిండి బురదమయంగా మారింది. సోమవారం రైతుమేళా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన 150 స్టాళ్లలో కొన్ని గాలులకు పడిపోయా యి. తొలుత రెండు రోజులు రైతు మేళా నిర్వహించాలనుకున్నా, శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి చిత్తడిగా మారడంతో ఆదివారం కార్యక్రమాన్ని రద్దు చేశారు. సోమవారం నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా వరుణుడు ఆటంకం కలిగించాడు. దీంతో రైతుమేళా నిర్వహించడం లేదని అధికారికంగా ప్రకటించారు. సభా ప్రాంగణ పరిస్థితులను సోమవారం పరిశీలించాక రైతు ఆశీర్వాద సభపై తుది నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ దివాకర ఒక ప్రకటనలో వెల్లడించారు.



## అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ 'స్పీకర్ పోలీసులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారు... పోలీసులారా ఖబడ్దార్.. వచ్చేది మేమే.. మా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మేము మిమ్మల్ని గుర్తు బెట్టుకుంటం.. అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం'అన్నారు. సీఎంను ప్రశ్నిస్తే 'ఎంత మొగోడైనా మూడు నెలల్లో పిల్లలు పుట్టిస్తరా అంటడు.. మూడు నెలల్లో పుట్టరు.. ముప్పై నెలలు అయినా పుట్టకపోతే ఏమనాలో మీరే చెప్పాలి'అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి మోదీ అంటే భయమని, బడేభాయ్ ఏది చెప్తే.. చోటా భాయ్ జీ హుజూర్ అంటారని, అందుకే బడేబాయ్ అడగ్గానే దామగుండం అడవిలో 2,700 ఎకరాలు నేవీకి రాసిచ్చిండని, నాడు తమకు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అడవి జోలికి రాకుండా మోదీని అడ్డుకున్నామన్నారు. ప్రతి ఒక్కరు బూత్ స్థాయినుంచి గట్టిగా పనిచేయాలని, రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలనే నినాదంతో ముందుకు వెళితే అధికారంలోకి వచ్చేది మనమే అన్నారు. లోక్‌సభకు ఎన్నికకు నామినేట్ చేసిన మీనాక్షినటరాజన్ అభ్యర్థిత్వాన్ని నాశనం చేసింది ముమ్మాటికి సీఎం రేవంత్‌రెడ్డే అని, బీజేపీ కాంగ్రెస్‌ది అక్రమ పొత్తులని అందరికి అర్థం అవుతోందన్నారు. ఓట్లు తొలగించి పశ్చింబెంగాల్‌లో మమతను బీజేపీ ఓడించిందని, ఏపీలోనూ చంద్రబాబు ఇదే చేయించి వైసీపీని ఓడించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో తెలంగాణ అమరవీరుడు మందడి యాదిరెడ్డి కుటుంబ సభ్యులు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎనికేపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త డప్పు కరంచంద్ కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

# మూసీ ప్రక్షాళన తథ్యం

(మొదటిపేజీ తరువాయి)



కోరుకుంటున్నారని అంటున్నారు. పరీక్ష పేపర్లు అమ్ముకొని రూ.వేల కోట్లు సంపాదించుకున్నందుకు రావాలా? కాళేశ్వరం పేరు మీద రూ.లక్ష కోట్లు కొల్లగొట్టినందుకా? పేదోళ్లకు రేషన్‌కార్డులు అడిగితే స్టేషన్‌లో పెట్టి కొట్టించినందుకా? మీరెందుకు అధికారంలోకి రావాలి. రచ్చబండలో చర్చ పెట్టండి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్నారు. రెండున్నరేళ్లలో ఏమి తెచ్చారని అడుగుతున్నారు. ఎప్పుడడిగినా ప్రత్యేక శాసనసభ, మండలి సమావేశాలు ఏర్పాటు చేస్తాం. పదేళ్ల భారాస, రెండున్నరేళ్ల కాంగ్రెస్, కేంద్రంలో పన్నెండేళ్ల భాజపా పాలనపై చర్చిద్దాం. అక్కడే తేలుస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెప్పుకోకపోవడం వల్ల ఊరూరా తిరిగి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. సింగరేణిలో టెండర్ కాలేదు.. కొల్లగొట్టారంటున్నారు. గురుకులాల్లో రూ.685 కోట్ల టెండర్లలో రూ.3వేల కోట్లు అక్రమాలు జరిగాయని చెప్పారు. ఎన్ని అబద్ధాలు చెప్పినా, ఎన్ని నాటకాలు చేసిన తెలంగాణ సమాజం నమ్మదు. రాష్ట్రంలో ప్రజాపాలన వచ్చింది. ప్రజలు సంక్షేమ పథకాలను అనుభవిస్తున్నారు. ఈ తెలంగాణ సమాజం మీ కుటుంబాన్ని శాశ్వతంగా బహిష్కరించింది. 2034 వరకు రాష్ట్రంలో మూడు రంగుల జెండా ఎగురుతుంది.

### ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం

ఎస్ఎల్‌బీసీ పనులను 34 కిలోమీటర్ల మేర పూర్తి చేసి భారాస ప్రభుత్వానికి 10 కిలోమీటర్ల పనులు అప్పగిస్తే పదేళ్లు అలానే ఉంచారు. వచ్చే ఎన్నికల నాటికి ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి 3.60 లక్షల ఎకరాల్లో నల్గొండ జిల్లాకు సాగు, తాగునీరు అందిస్తాం. డిండి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. నా పాదయాత్ర సమయంలో మూసీ ఇబ్బందులను ప్రజలు వివరించారు. ఆ కాలుష్యంతో ఇబ్రహీంపట్నం, భువనగిరి, మునుగోడు ప్రాంతాలు ఎంతో దారుణంగా ఉన్నాయి. అందుకే మూసీ ప్రక్షాళనకు కంకణం కట్టుకున్నాం. 30 నెలల్లో 70వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిన ప్రభుత్వం ఈ దేశంలో ఎక్కడైనా ఉందా అని సవాల్ విసురుతున్నా. శాఖల వారీగా లెక్కలు చెబుతా. శాసనసభకు రండి. నిరుద్యోగుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టాం. ప్రజా పాలన ఎందుకు పోవాలి. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినందుకు, రూ.27వేల కోట్ల రైతు భరోసా ఇచ్చినందుకు ప్రజా పాలన పోవాలా? స్కిల్స్ యూనివర్సిటీ తెచ్చినందుకు పోవాలా? కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయిన ఒక్క సంవత్సరంలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాం. భారాస పాలనలో ప్రభుత్వ బడికి, ఆసుపత్రికి పోవాలంటే ప్రజలు భయపడేవారు. ఇప్పుడు అదే పాఠశాలల్లో నర్సరీ నుంచి 12 వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నాం. తెలంగాణ గురుకులాలు వందల మంది అంబేడ్కర్‌లను తయారు చేయాలనే టమొక్కవొని ధైర్యంతో ముందుకు పోతున్నాం. ఆరుట్ల పాఠశాల ప్రారంభోత్సవానికి వెళ్లాక నాకు సంపూర్ణ విశ్వాసం వచ్చింది. మా ప్రభుత్వ ఉపాధ్యాయులు మేం గర్వంతో తలెత్తుకునే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే కడుపు మంట ఎందుకు?

ఐదు సంవత్సరాలు భారాస మంత్రి వర్గంలో ఒక్క ఆడబిడ్డ అయినా ఉందా? పదేళ్లలో రేషన్‌కార్డు ఇవ్వలేదు. మా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు లక్షల మంది పేదలకు రేషన్‌కార్డు అందించింది వాస్తవం కాదా? ఆర్థికంగా భారమైనా పేదవారి కడుపు నింపాలని రూ.16 వేల కోట్లతో 3.28 కోట్లమంది పేదలకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం అందిస్తున్నాం. మీరు గజ్వేల్‌లో ఫాంహౌస్ కట్టుకోవచ్చు. కుమార్తె, కుమారుడు, అల్లుడు రూ.వందల కోట్లు పెట్టి ఫాంహౌస్‌లు నిర్మించుకోవచ్చు. పేదోళ్లకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే మీకు కడుపు మంట ఎందుకు? ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల చొప్పున ఉచితంగా ఇస్తున్నాం?" అని రేవంత్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాలునాయక్, లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, సామేల్, వేముల వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి, పద్మావతి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, కోటిరెడ్డి, సత్యం, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ పాల్గొన్నారు.

## సీఎంకు భయం పట్టుకుంది

(మొదటిపేజీ తరువాయి)



ఘాటుగా స్పందించారు. నల్లగొండ పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆదివారం సిద్దిపేటజిల్లా కేంద్రంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో హరీశ్‌రావు స్పందించారు. కర్ణాటకలో ముగ్గురు ముఖ్యమంత్రుల సమావేశ మతలబు గురించి అడిగితే దానికి బదులు ఇవ్వకుండా, సీఎం రేవంత్‌రెడ్డి నల్లగొండ సభలో నా పొడవు, ఎత్తు గురించి మాట్లాడి తప్పించుకోవాలని చూస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులు ముంచి ముంపుమేస్త్రీగా మారొద్దని ప్రశ్నిస్తే బదులు లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మనస్సు, ఆలోచన, బుద్ధి అంతా పొట్టిదేనని ఎద్దేవా చేశారు. 2034 వరకు అధికారంలోనే ఉంటామని మాట్లాడిన రేవంత్‌రెడ్డికి నిజంగా నమ్మకం ఉంటే అసెంబ్లీ రద్దు చేయాలని, ప్రజా క్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ విసిరారు. లేకుంటే పార్టీ మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజల్లోకి పోదామని, దమ్మూధైర్యం ఉంటే తన సవాల్ స్వీకరించాలన్నారు. రైతుభరోసా ద్వారా రైతుల కళ్లల్లో ఆనందం చూస్తున్నా అని అంటున్న సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. రైతు భరోసా, రైతుబీమాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు వచ్చేలా చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ముందు తెలంగాణ రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో 12 మీటర్లు కూడా తవ్వలేదని, అన్యాయంగా ఎనిమిది మంది అమాయక కార్మికులు చనిపోతే వారి శవాలను కూడా తీయలేని అసమర్థ ప్రభుత్వం అని విమర్శించారు. సింగరేణి అవినీతి బహిర్గతం చేస్తే అసలు టెండర్లు కాలేదని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సృజన్‌రెడ్డికి టెండర్లు దక్కింది రుజువు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. కాళేశ్వరం కూలింది అని ఆరోపణలు చేసిన సీఎం ఇప్పుడు హైదరాబాద్ తాగునీరు, మూసీకి ఎక్కడి నీళ్లు తరలిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో తన పాత్రపై సీఎం వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమ సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు వెళ్తూ తుపాకీ గురి పెట్టిన రేవంత్‌రెడ్డి చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు. తెలంగాణ ఉద్యమం, త్యాగం గురించి రేవంత్‌రెడ్డి మాట్లాడితే తెలంగాణ ప్రజలు నవ్వుకుంటారని చెప్పారు.

## ప్రజా భాగస్వామ్యంతోనే ప్రగతి

### ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** దేశ భద్రత, స్వావలంబన దిశగా భారత్ సరికొత్త మైలురాళ్లను చేరుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సముద్రాల నుంచి గగనతలం దాకా మన దేశం మరింత సురక్షితంగా, స్వయం సమృద్ధిగా మారుతోందని హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం 'మన్ కీ బాత్' 135వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. రక్షణ రంగంలో విజయాలు, కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు, పర్యావరణ పరిరక్షణ, మూఢనమ్మకాల నిర్మూలన తదితర అంశాలను ప్రస్తావించారు. ప్రధానమంత్రి ఏం చెప్పారంటే.. "కోల్‌కతాలో జరిగిన నావికాదళ కార్యక్రమంలో ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ యుద్ధనౌకలు భారత నౌకాదళంలో చేరాయి. వీటి డిజైన్ నుంచి తయారీ వరకు అంతా స్వదేశీ పరిజ్ఞానమే. విమానయాన రంగంలోనూ భారత్ మరో ఘనత సాధించింది. మొట్టమొదటి 'మేడ్ ఇన్ ఇండియా'సి--295 సైనిక రవాణా విమానం తొలి ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఇలాంటి 40 విమానాలు మన దేశంలోనే తయారవుతున్నాయి" అని అన్నారు.

### సామాన్యులకు బీమా భద్రత

"బీమా పథకాలు సామాన్యుల జీవితాలకు భద్రత కల్పిస్తున్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బహదూర్‌పురాకు చెందిన పెత్కర్ కుటుంబం వివాహ వేడుక సందర్భంగా 3,500 మంది గ్రామస్థులకు రూ.లక్ష చొప్పున ప్రమాద బీమా సదుపాయం కల్పించడం హర్షణీయం. అందుకు వారిని అభినందిస్తున్నా. కేంద్ర ప్రభుత్వం సైతం కోట్లాది మందికి బీమా రక్షణ కల్పిస్తోంది. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన కింద కేవలం రూ.20 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తోంది. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా అందుతోంది" అని అన్నారు.

### మూఢ నమ్మకాలపై అస్సాం మహిళల పోరు

"మూఢ నమ్మకాలను సైన్స్, తర్కంతో పారదోలవచ్చని అస్సాం మహిళలు నిరూపించారు. పరిసరాలను శుభ్రపర్చి పర్యావరణానికి మేలు చేసే హర్గిలా అనే అరుదైన పక్షిని అపశకునంగా భావించి చెట్లను నరికివేస్తూ వాటిని తరిమేసేవారు. అయితే, జీవ శాస్త్రవేత్త పూర్ణిమా దేవి బర్మన్ చొరవతో అస్సాం మహిళలు 'హర్గిలా ఆర్మీ'గా ఏర్పడి ఆ పక్షులను సంరక్షిస్తున్నారు. హర్గిలా పక్షులు అపశకునం కాదని రుజువు చేస్తున్నారు. ఆ పక్షులు నేడు అస్సాం గ్రామాలకు గొప్ప గుర్తింపుగా మారాయి " అని అన్నారు. "మేఘాలయాలో దశాబ్దాల పాటు రబ్బరు చెట్ల వేర్లను పరస్పరం అనుసంధానించి సహజసిద్ధంగా నిర్మించిన వేర్ల వంతెనలు నిజంగా అద్భుతం. ఈ వంతెనల సంరక్షణకు 50 ఏళ్లుగా కృషి చేస్తున్న హాలీవార్‌కు ఈ ఏడాది పద్మ పురస్కారం లభించింది. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లా బియోరాలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి 'ఎకో--బ్రిక్స్'గా మార్చి బహిరంగ ప్రదేశాలను సుందరంగా తీర్చిదిద్దడానికి స్థానిక మహిళలు కృషి చేస్తుండడం ఎంతైనా ప్రశంసనీయం" అని అన్నారు.

### వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని చాటిచెప్పాలి

"గణేశ్ చతుర్థి ఉత్సవాలకు సంబంధించిన అంశంపై మాట్లాడాలని కోరుతూ చాలామంది నాకు లేఖలు రాశారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూజించడం మానుకోవాలి. పర్యావరణాన్ని కాపాడేందుకు దేశీయ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలి. వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తిని చాటిచెప్పాలి"అని మోదీ పిలుపునిచ్చారు.



## ఉద్రిక్తతలకు ఇక ముగింపు

(మొదటిపేజీ తరువాయి)

ఆ జలసంధిలో నౌకలు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తాయని వెల్లడించారు. ఇరాన్ అణు కార్యక్రమంపై తొలుత స్విట్జర్లాండ్‌లో చర్చలు జరపాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ.. తాజాగా ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో వేదికను దోహాకు మార్చారు. ఈ చర్చలపై అమెరికా అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య యుద్ధం ముగించేందుకు ఇటీవల ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. దీంతో కీలకమైన హర్మూజ్‌లో చమురు రవాణా తిరిగి ప్రారంభమైంది. అయితే రెండు రోజుల క్రితం ఇరాన్ బలగాలు.. చమురుతో వెళుతున్న ఓ ఖరీదైన వాణిజ్య నౌకపై డ్రోన్లతో దాడికి దిగాయి. వాటిలో ఒక డ్రోన్ కార్గో షిప్‌ను ఢీకొట్టింది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ధిక్కరించినందుకు అమెరికా ప్రతీకార దాడులు చేపట్టింది. ఆ దేశ క్షిపణులు, డ్రోన్ల నిల్వ కేంద్రాలపై యుద్ధవిమానాలతో విరుచుకుపడింది. ఇరాన్ సైతం గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై దాడి చేసింది. రెండు రోజుల పాటు ఇరుదేశాలు పరస్పరం దాడులకు దిగడంతో యుద్ధం మళ్లీ మొదటికి వచ్చినట్లు భావించారు. అయితే, నష్టనివారణ చర్యలకు ఉపక్రమించిన అమెరికా, ఇరాన్‌లు.. దాడులు మరింత పెరగకుండా, ఉద్రిక్తతలు చల్లార్చేలా నిర్ణయం తీసుకున్నాయి.



## చిన్నారుల బంగారు భవితకు పోలియో చుక్కలు

(మొదటిపేజీ తరువాయి)

అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా 52 లక్షల బీఓపీవీ వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, స్థానిక ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, కలెక్టర్ ప్రియాంక, హెల్త్ డైరెక్టర్ రవీంద్ర కుమార్, డీఎంహెచ్‌వో పుట్ట శ్రీనివాస్ పాల్గొన్నారు. సభాస్థలిపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఫొటో లేకపోవడంతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రసంగిస్తుండగా.. పలువురు కార్యకర్తలు ప్రశ్నించారు. వారిని నవీన్‌యాదవ్ వారిస్తుండగానే ప్రసంగాన్ని మధ్యలో ఆపిన మంత్రి సభను ముగించి ఆసుపత్రి లోపలికి వెళ్లిపోయారు. సంబంధిత అధికారులు ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.



## నాగారంలో సార్ సర్వేప్రక్రియ

**మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్**

**నాగారం, జూన్ 28 (జనంవార్త) :** నాగారం డివిజన్ పరిధిలోని ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సార్) సర్వే పక్రియ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, నిమ్మల శ్రీను,రవీందర్ రెడ్డి,విజయ్ కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.



## తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

**ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి**

**మేడ్చల్ :** పోలియోను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి తల్లిదండ్రులు ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 28, ఆదివారం ప్రభుత్వం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ శివ శివాని కాలనీ, హకీంపేటలలో ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.




## పీర్జాదిగూడలో చిన్నారులకు పల్స్ పోలియో

**పీర్జాదిగూడ :** పీర్జాదిగూడ డివిజన్ కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంక ట్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామల శ్రీనివాస్, వెంకట్, పన్నాభాయ్, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆశా వర్కర్ షాకిరా పాల్గొన్నారు.



## పల్స్ పోలియో సిబ్బందికి భోజన వసతి

**ఉప్పల్ :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా కుషాయిగూడ, జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మ-ణిపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి అల్లూరయ్య, పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమంలో నిమగ్నమైన వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సేవలను గుర్తించి కాంగ్రెస్ నాయకులు భోజన వసతి కల్పించడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పేర్కొంటూ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు సింగం కిరణ్, మామిడి శ్రీనివాస్, ఉపేందర్ రెడ్డి, రహమతుల్లా, సలీం, సువాస్, ప్రకాష్, రాజేష్, సాయి, ఉమేష్, రామ్ తదితరులు పాల్గొన్నారు.



## వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో ఇంటింటికి ఎస్ఐఆర్

**ఓటర్లను కలిసి పత్రాలు అందజేసిన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాస్ రెడ్డి**

**బోడుప్పల్ :** సర్కిల్ పరిధిలోని వెస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా 470 బూత్ నంబర్ లోని ప్రతి ఇంటి ఓటర్ ను కలిసిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చింతల శ్రీనివాసరెడ్డి వారికి ఓటర్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు ఎస్ఐఆర్ వివరాలు తెలియజేస్తూ ఫారాలను నింపి బిఎల్ఓ లకు అందజేయాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చింతల శ్రీనివాస్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ చింతల విజయలక్ష్మి, బిఎల్ఓ బాల్ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహనతోనే

# సంపూర్ణ జీవనం

**ఈఎస్ఐసి డిప్యూటీ డైరెక్టర్ వెంకట్ కృష్ణరెడ్డి**

**విజయవంతంగా 130వ జన విజ్ఞాన వేదిక వైద్య శిబిరం**




**చర్లపల్లి, జూన్ 28 (జనంవార్త) :** ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం జన విజ్ఞాన వేదిక చేపడుతున్న వైద్య శిబిరాలు, సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని ఈఎస్ఐసి డిప్యూటీ డైరెక్టర్ సి.వెంకట్ కృష్ణరెడ్డి అన్నారు.ఆదివారం చక్రిపురంలోని చక్రి పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి,ఆహారపు అలవాట్లు,శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిళ్లు పెరగడం వల్ల బీపీ, షుగర్,గుండె సంబంధిత వ్యాధులు అధికమవుతున్నాయని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు సమతుల ఆహారం, వ్యాయామం, తగినంత విశ్రాంతికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా వేదిక నిరంతరం వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనారోగ్యకర జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ఉచిత వైద్య శిబిరాల




ప్రధాన ఉద్దేశమని తెలిపారు. శిబిరంలో వైద్యులు తెస్లా ల్యాబ్ వారి సహకారంతో ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేస్తూ,వైద్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ల బృందం విద్యాసాగర్, దేవిక,నవనీత, జయరాజ్, సైక్రియాటిస్ట్ డాక్టర్ మనోహర్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు, జిల్లా అధ్యక్షులు తోట శ్రీనివాస్ మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ జి.కరుణాకర్ రెడ్డి, వెంకటరమణ, శేషు,నాగేశ్వర్ రావు, శేషగిరిరావు, శివశంకర్ రెడ్డి, సోమయ్యచారి, శశిధర్ రెడ్డి,సిహెచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల బంగారు భవిష్యత్తుకు

# రెండు పోలియో చుక్కలు

**పాల్గొన్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, ముప్పు శ్రీనివాస్ రెడ్డి**

**నాగారం,జూన్ 28 (జనంవార్త) :** పల్స్ పోలియో చుక్కల కార్యక్రమని నాగారం డివిజన్ పరిధిలోని పలు వార్డులలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యకరమైన బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు.






పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. రెండు పోలియో చుక్కలే చిన్నారుల జీవితానికి పెద్ద రక్షణ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, అన్నం రాజు శ్రీనివాస్ సతీష్ గౌడ్,కందాడి శ్రీనివాస్ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి, భద్రు నాయక్,పంగ సంతోష్,సూరజ్ చంద్రశేఖర్, రఘుపతి, కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

## 'మన్ కీ బాత్' దేశ నిర్మాణానికి దిశానిర్దేశం

**ప్రతి నెలా కుటుంబ సభ్యులతో కలిసి వీక్షించాలి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**


**సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని వైభవ్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ 135వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సామూహికంగా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి నెల చివరి ఆదివారం ఉదయం 11 గంటలకు ఎలాంటి విరామం లేకుండా 'మన్ కీ బాత్' నిర్వహించడం ప్రధాని మోదీ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. దేశ ప్రధానిగా స్థానిక, జాతీయ, అంతర్జాతీయ అంశాలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, ప్రతి నెల ప్రజలతో నేరుగా మమేకమవుతూ దేశానికి దిశానిర్దేశం చేయడం విశేషమన్నారు.'మన్ కీ బాత్' ద్వారా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, పర్యావరణ పరిరక్షణ, యువత సాధనలు, క్రీడలు, పర్యాటకం, ఆవిష్కరణలు వంటి అనేక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడి భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఇటీవల ప్రధాని మోదీ దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా బంగారం వినియోగంలో మితంగా ఉండాలని చేసిన సూచనకు దేశ ప్రజలు సానుకూలంగా స్పందించారని కిషన్ రెడ్డి తెలిపారు.




ప్రతిపక్షాల విమర్శలను పక్కనపెట్టి, కరోనా సంక్షోభం, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు వంటి క్లిష్ట సమయంలో కూడా ప్రధాని మోదీ భారత ప్రయోజనాలను కాపాడే నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు.యుద్ధాలు సమస్యలకు శాశ్వత పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యపరమైన సంభాషణల ద్వారానే ప్రపంచ శాంతి సాధ్యమని ప్రధాని మోదీ ఎల్లప్పుడూ చెబుతున్నారని గుర్తు చేశారు.ప్రతి నెలా చివరి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రధాని మోదీ నాయకత్వానికి మరింత బలంగా అండగా నిలవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న విఠల్ నాయక్

**ఉప్పల్ :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కాప్రా గాంధీనగర్‌లో నిర్వహించిన పోలియో కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ, రెండు చుక్కలు ప్రతి చిన్నారి జీవితానికి రక్షణ కవచం. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.



సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నిండు జీవితానికి రెండు చుక్కలు

**చిన్నంరాజు సాయినాథ్ గౌడ్**

**నాగారం, జూన్ 28 (జనం వార్త) :** చిన్నారుల ఆరోగ్యకరమైన బంగారు భవిష్యత్తుకు రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్ అన్నారు.ఆదివారం నాగారం డివిజన్ పరిధిలోని పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయినాథ్ గౌడ్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.



## శ్రీరాంపురంలో పల్స్ పోలియో చుక్కలు

**నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పల్స్ పోలియో**

**కాకినాడ :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి మండలం శ్రీరాంపురం గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పోలియో నివారణ ప్రాముఖ్యతను వివరించి, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అవగాహన కల్పించారు. ఎలాంటి చిన్నారిని వదలకుండా ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలందరూ ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సహకరించి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడాలని ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి కోరారు.



## చుక్కల మందుకు చక్కటి స్పందన

**చిన్నారులకు చుక్కల మందు వేసిన డిప్యూటీ కమిషనర్**

**బోడుప్పల్ :** సర్కిల్ పరిధిలో పోలియో చుక్కల మందుకు మంచి స్పందన లభించింది. బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కోట్ల వెంకట్ నరేష్, ఎ.ఎన్.ఎమ్. సుజాత, వైద్య సిబ్బంది, ఇతర ఆరోగ్య శాఖ, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.



## పీర్జాదిగూడలో చిన్నారులకు పల్స్ పోలియో

**కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**

**పీర్జాదిగూడ :** పీర్జాదిగూడ డివిజన్ కమలానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా బాధ్యతాయుతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామల శ్రీనివాస్, వెంకట్, పన్నాభాయ్, అంగన్వాడీ టీచర్ రమాదేవి, ఆశా వర్కర్ షాకిరా తదితరులు పాల్గొన్నారు.

# ఓట్స్‌ను రోజూ తింటే అద్భుతమైన లాభాలు!

మన ఆరోగ్యానికి మేలు చేసే తృణ ధాన్యాలల్లో ఓట్స్ కూడా ఒకటి. వీటిలో బీటా గ్లూకాన్ అని పిలువబడే కరిగే ఫైబర్ తో పాటు అవెనాంత్రామైడ్స్ అని పిలువబడే యాంటీ ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. ఓట్స్ ను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, షుగర్ ను అదుపులో ఉంచడంలో, బరువును తగ్గించడంలో, జీర్ణశక్తిని మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా ఓట్స్ మనకు సహాయపడతాయి. వీటిని తరచూ ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఓట్స్ ను ఆహారంగా తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

ఓట్స్ ను తీసుకోవడం వల్ల వీటిలో ఉండే ఫైబర్ పేగుల్లో ఉండే కొలెస్ట్రాల్ ను బంధిస్తుంది. తద్వారా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. వీటిని తరచూ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ దాదాపు 5 నుండి 10 శాతం వరకు తగ్గుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఓట్స్ ను తీసుకోవడం వల్ల కార్బోహైడ్రేట్స్ రక్తంలోకి నెమ్మదిగా ప్రవేశిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు వెంటనే పెరగకుండా ఉంటాయి. టైప్ 2 డయాబెటిస్ తో బాధపడే వారు ఓట్స్ ను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు రాకుండా ఉంటాయి. అలాగే ఓట్స్ ను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ ధమనుల ఆరోగ్యానికి మద్దతును ఇస్తుంది. దీంతో సిస్టోలిక్ బిపి అదుపులో ఉంటుంది. ఓట్స్ ను 8 వారాల పాటు తీసుకోవడం వల్ల సిస్టోలిక్ బీపీ 2 నుండి 3 ఎమ్ఎమ్ హెచ్‌జి వరకు తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.



### బరువు తగ్గాలంటే..

అధిక రక్తపోటుతో బాధపడే వారు ఓట్స్ ను రోజూ తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను చూడవచ్చు. ఓట్స్ లో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆకలి త్వరగా వేయకుండా ఉంటుంది. దీంతో మనం క్యాలరీలను తక్కువగా తీసుకుంటాం. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. ఓట్స్ ను తీసుకోవడం వల్ల పేగులో మంచి బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. మలబద్ధకం సమస్య తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఓట్స్ లో మెగ్నిషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్ వంటి పోషకాలు ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. ఇలా అనేక రకాలుగా ఓట్స్ మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మనం అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయని వైద్యులు తెలియజేస్తున్నారు.



# శ్రీవరి సాగు.. లాభాలు బాగు

ఆరుతడి పంటలతో పాటు, శ్రీవరిసాగు సైతం రైతులను లాభాల బాటపట్టిస్తున్నది. కరువులో సైతం శ్రీవరిసాగుతో వరిపంటను అధికంగా దిగుబడి చేయవచ్చునని అధికారులు సూచిస్తున్నారు. శ్రీవరిసాగు పద్ధతిలో మెలుకువలు పాటిస్తే మంచి పంట దిగుబడిని పొందవచ్చని పేర్కొంటున్నారు. మండలంలో శ్రీవరి సాగును మరింత విస్తరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శ్రీవరి సాగు పై మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ సూచించిన సలహాలు, జాగ్రత్తలు ఇలా ఉన్నాయి.



### శ్రీవరిసాగు పొలం తయారీ

సాధారణ వరిలాగే శ్రీవరిసాగుకు పొలం తయారు చేయాలి. వరినాటేందుకు ముందుగా కరిగట్లను సిద్ధం చేసుకుని పొలంలో ఎత్తు పల్లాలులేకుండా పొలం దున్ని సిద్ధం చేసుకోవాలి. పొలం చుట్టూ లోపలి నుంచి చిన్నచిన్న గట్లు వేసుకోవాలి. శ్రీవరిసా గులో పొలం తడిగా, బురదగా పదునుగా ఉండాలి. నీరు ఎక్కువగా నిలువ ఉండకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే బయటికి పోవటానికి పొలంలో చిన్నచిన్న లోతైన సేడులను ఏర్పాటు చేసుకుని నాట్లు వేయటానికి పొలం సిద్ధం చేసుకోవాలి.

### నారుమడి తయారు

శ్రీ' పద్ధతిలో వరినారును 8 నుంచి 12 రోజుల్లో నాటాలి. నారు పెంచటంలో తగిన మెళకువలు పాటించాలి. దీనికోసం రెండుకిలోల మేలిరకం విత్తనాన్ని ఒక సెంటుభూమిలో పలుచగా చల్లి, పెంచితే ఎకరా పొలంలో నాటవచ్చు. భూమిని మెత్తగా దున్ని, దుమ్ము చేసి, కొంచెం ఎత్తుగా తయారుచేసి, దానికి చుట్టు కాలువ తీయాలి. తడి మట్టి జారిపోకుండా నారుమడి చుట్టూ వరిఎండు గడ్డితో కానీ వెదురు బొంగులతో ఊతం ఏర్పాటు చేయాలి. నారుమడి తయారైన తర్వాత పశువుల ఎరువులను ఒక పొరలాగా చల్లాలి. దానిమీద 24గంటలు నానబెట్టి, మండికట్టిన విత్తనాలను పలుచగా చల్లాలి. విత్తనాలపైన పలుచగా పశువుల ఎరువులను వేసి ఉంచాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. పశువుల ఎరువును వేయాలి. పై నుంచి గడ్డి కప్పి ఉంచాలి. దానిపై రోజూ నీరు చల్లుతూ తడపాలి. ఎనిమిది రోజుల్లో వరినారు రెండు నుంచి మూడు ఆకులతో ధృఢంగా పెరుగుతుంది. నారుమడి నుంచి నారును పాతపద్ధతిలో పీకకుండా మట్టితో సహావేరు చేసి ప్లాస్టిక్ ట్రేలలో పొలానికి నారును తరిలించాలి.

### వరినాట్లు వేసే విధానం

నాట్లు వేసేందుకు తయారుచేసిన పొలంలో 25పొడవు, 25 సెం.మీ. ఎడంగా ముందుగా గీతలు గీసుకోవాలి. గీతలు గీసే ప్రాంతంలో ఒక్కొక్క మొక్కను పైపైగా నాటాలి. బురద మట్టిలో సహా మొక్కలను నాటితే వాటిపై ఒత్తిడిలేకుండా స్థిరంగా బలంగా పెరుగుతాయి. మొక్కలు నాటేటప్పుడు నేల బురదపదు నుగా ఉండాలి. మొక్కలను నిటారుగా, జాగ్రత్తగా నాటితేనే పంట మంచి దిగుబడినిస్తుందని నిపుణులు సూచించారు.

### కాలిబాటలు తీసే విధానం..

శ్రీవరిసాగు పద్ధతిలో ప్రతి 25సెం.మీ.నాట్లు వేయుటకు ముందుగాని 15-20 సెం.మీ. వెడల్పు 15-20 సెం.మీ.లోతులో పొలంలో పొలంలో బాటలు తీయాలి. దీని వలన గాలి, వెలుతురుతో పాటు నీరు పెట్టుకోవటానికి వీలుగా ఉంటుంది. దీంతో రైతుపొలంలో అటూఇటూ తిరిగేందుకు సైతం వీలుగా ఉంటుంది. దీంతో చీడపీడలు సైతం పంటను అంతగా ఆశించవు.

### కలుపు నివారణ

శ్రీపద్ధతిలో నీరు నిలువకుండా చూడటంతో కలుపు సమస్య అధికంగా ఉంటుంది. కలుపు నివారణకు రోటరీవీడర్‌తో నాటిన పదిరోజులకొకసారి, ఆ తర్వాత పదిరోజులకొకసారి మరో రెండు నుంచి మూడు సార్లు నేలను వీడర్‌తో ముందుకు, వెనక్కి కదిలించటంతో కలుపు మొక్కలు నేలలో కలిసిపోతాయి. రోటరీవీడర్ వాడకటం వలన వేరుకు బాగా ఆక్సిజన్ అందుతుంది. దీంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది స్థిరీకరిస్తాయి. దీంతో వీడర్‌ను ఉపయోగించే ముందు నీటిని అధికంగా ఉంచాలి. వీడర్‌కు మట్టి అంటుకోదు. వీడర్ తేలికగా తిరుగుతుంది. లేదంటే మిగిలిన కలుపు మొక్కలను తీసివేయాలి.

### సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

శ్రీవరిసాగులో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, జనుమువంటి సేంద్రియ ఎరువులను వాడటంతో భూసారం బాగా పెరుగుతుంది. పశువుల ఎరువును ఎకరానికి నాలుగు టన్నులను ఉపయోగించాలి. దీంతోపాటు వానపాముల ఎరువులను వాడాలి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. శ్రీవరి పద్ధతిలో 8 నుంచి 12 రోజుల్లో నారు వేర్లు బాగా అభివృద్ధి చెంది, బలంగా పెరుగుతాయి. దీంతో ముప్పై నుంచి యాభై పిలకలు వస్తాయి.

### నీరు అందించే పద్ధతి

శ్రీవరిపంటకు సాగునీరందించటంలో చాలా జాగ్రత్త అవసరం. నాటిన వరి పిలకలు బాగా వచ్చేందుకు పొలం తడితడిగా పొడిపొడిగా ఉండేలా చూసుకోవాలి. మొక్కల్లో నీరు నిలువకుండా జాగ్రత్త వహించాలి. దీని కోసం ప్రతి రెండుమీటర్లకు 15-20 సెం.మీ. వెడల్పు, 15-20 సెం.మీటర్ల లోతులో సేడులు ఏర్పాటు చేసుకోవాలి. మధ్యమధ్యలో పొలం ఆరితే నీటితో తడుపుతుండాలి. దీంతో పంటవేర్లు ఆరోగ్యంగా బలపడుతాయి. పొలంచుట్టు చిన్నచిన్న ఈనెగట్లు, ఎల్లగట్లు వేసుకోవటం వలన నీటి యాజమాన్యం సక్రమంగా జరుగుతుంది. నీరును పెడుతూ తీయటంతో కలుపు వస్తుందనే భయంతో అధిక నీటిని నిలగడితే పిలకలు రాకుండా పోతాయి. పొలంలో నీటిని బట్టి నీటిని పెట్టడం, తీయటం చేయాలి. తక్కువ నీటితోనే శ్రీవరిసాగు చేయవచ్చును. మూడునాలుగు రోజులకు సాగునీరందిస్తే చాలు శ్రీవరితో అధిక దిగుబడిని పొందవచ్చును.





# ఆమ్మో నేటికాలం పిల్లలా..!



- మాటవినడం లేదని తలలు పట్టుకుంటున్న తల్లిదండ్రులు
- ఆటలు మరచి ఫోన్లు, టీవీలకే అతుక్కుపోతున్న పిల్లలు
- ర్యాంక్‌లకు తప్పా ఆటలకు ప్రాధాన్యత ఇవ్వని నేటి ప్రైవేటు స్కూల్స్

**నేటి ఆధునిక బిజీ ప్రపంచంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు. వారి ఆహారపు అలవాట్లు ఏమిటి, వారి స్నేహాలు, వారు ఎలా చదువుతున్నారు అన్న విషయాలపై శ్రద్ధ వహించరు. ఒకప్పుడు చూస్తే మన తల్లిదండ్రులు అంటే భయం భక్తులు ఉండేవి. వారు చెప్పినట్లు వినేవాళ్లు. అలానే ఎక్కువగా శారీరక ఆటలకు ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళం. ఇప్పుడు సెల్ ఫోన్లు, వీడియో గేమ్ లు వచ్చాక పిల్లలు శారీరక ఆటలకు దూరమయి తినడం టీవీ, ఫోన్ల ముందు కూర్చోవడం వలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. అసలు పిల్లల గురించి ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, వారిని వృద్ధిలోకి ఎలా తేవాలి అనే విషయాల గురించి ప్రత్యేక కథనం...**

పిల్లలకి తల్లిదండ్రులే మొదటి గురువులు. భవిష్యత్తులో చిన్నారులు సరైన దారిలో నడవలాంటే పెద్దలుగా మీ నడవడికలో కొన్ని మార్పులు చేసుకోవాలి. అవేంటంటే... పిల్లలకు మీరేంటో స్పష్టంగా తెలియాలి. వాళ్ల ముందు అనవసరపు భేషజాలను ప్రదర్శించకూడదు. పొరపాటు జరిగితే ఒప్పుకోవడమే కాదు దాన్ని సరిదిద్దుకునే ప్రయత్నం కూడా చేయాలి. అప్పుడే చిన్నారులూ పాటిస్తారు. పెద్దవాళ్లుగా మీరెప్పుడూ జీవిత పాఠాలను చెబుతూనే ఉండాలని.. పిల్లలు వాటిని వింటూనే ఉండాలని కోరుకోకూడదు. చిన్నారులు చెప్పే విషయాలను మీరూ ఆసక్తిగా వినాలి. అప్పుడే వారు మనసులోని భావాల్ని స్వేచ్ఛగా మీతో పంచుకోగలుగుతారు. మీ అనుబంధం బలపడుతుంది. పెద్దలు పోషకాహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే వాళ్లూ మెల్లగా అవే నేర్చుకుంటారు. అలా పిల్లలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటానికి అవసరమైన పునాదిని చిన్నతనంలోనే వేయొచ్చు. ప్రేమంటే.. పిల్లలకు కావాల్సిన వస్తువులను అప్పటికప్పుడు సమకూర్చడం కాదు. చిన్నారులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకోవడం, మనసు విప్పి మాట్లాడటం, మీకు నేనున్నాననే భరోసాను కల్పించడం.

## పిల్లలు గొడవపడుతున్నారా...:

ముగ్గురు పిల్లలున్న ఇళ్లల్లో సాధారణంగా చిన్నచిన్న విషయాలకే గొడవలు జరుగుతుంటాయి. మామూలే అన్నట్టుగా వీటిని నిర్లక్ష్యంగా వదిలేయ కూడదు. అలాగని ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో చూసి భయపడకూడదు. ముగ్గురిని సమానమే అని చూడాలి. తల్లిదండ్రులు ముందుగా ముగ్గురిని సమానంగా చూడటం మొదలుపెట్టాలి. కొంతమంది క్రమపద్ధతి పేరుతో పెద్ద పిల్లలను ఎక్కువగా మందలిస్తూ, చిన్నవాళ్లను మరీ గారాబం చేస్తుంటారు. దీంతో తల్లిదండ్రులకు నాకంటే ఎదుటివాళ్లే ఇష్టమని అపోహపడి వారిపై అనవసరంగా అసూయను పెంచుకుంటారు. క్రమేపీ అది మరింత పెరిగి పెద్దదవుతుంది. సాధారణంగా ఎక్కువగా ఇళ్లల్లో పిల్లల మధ్య తగాదాలకు కారణం టీవీ రిమోటే అవుతుంది. పిల్లలు ఇద్దరూ టీవీ చూడాలనుకుంటారు. కానీ చెరో ఛానెల్ కావాలంటారు. ఇలాంటప్పుడు ఒక్కొక్కరికీ ఒక్కో సమయాన్ని కేటాయించాలి. అలాగే అమ్మానాన్నల సెల్ ఫోన్ తీసుకుని గేమ్స్ ఆడే విషయంలోనూ గొడవలు జరుగుతుంటాయి. ఇలాంటప్పుడు ఇద్దరికీ జ్ఞానం కోసం తక్కువ సమయాన్ని కేటాయించాలి.



ఇలా మీరు చూపించే అంతులేని ప్రేమాభిమానాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. మీరు సానుకూలంగా ఆలోచిస్తే చిన్నారులకూ అదే అలవాటవుతుంది. క్లిష్ట పరిస్థితులను సవాలుగా తీసుకుని మీరు ధైర్యంగా ముందడుగు వేస్తే... పిల్లలూ అదే బాటలో పయనిస్తారు.

## చదవాలంటే ఏం చేయాలి...:

టీవీ చూడటమన్నా పిల్లలు సెల్ ఫోన్లో గేమ్స్ ఆడటమన్నా పిల్లలకు ఎంతిష్టమో చెప్పలేం. కానీ పుస్తకాలు చదవడ మంటే మాత్రం... 'అందులో ఏముందో నువ్వే చెప్పమ్మా' అనేస్తుంటారు. ఇలాంటి వారిలో పుస్తక పఠనం పట్ల ఆసక్తి కలిగించడానికి ఇలా ప్రయత్నించవచ్చు. రంగురంగుల బొమ్మలతో ఆకర్షణీయంగా ఉండే కథల పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. నిద్రపోయే ముందు చిన్నారులకు రోజూ ఓ కథను చెప్పడం అలవాటు చేయాలి. దీనివల్ల వాళ్లకు కథలంటే ఆసక్తి పెరుగుతుంది. ఇలాంటి చాలా కథలు పుస్తకాల్లో ఉంటాయని చెప్పాలి. దీంతో పుస్తకాలు చదవాలనే ఆసక్తికి చిన్నతనంలోనే బీజంపడుతుంది. ముందుగా వాటిని చూడటం అలవాటు చేస్తే అందులోని బొమ్మలను ఆసక్తిగా గమనిస్తుంటారు. ఆ తర్వాత వాటిలోని అక్షరాలను చదవడానికి మెల్లగా ప్రయత్నిస్తుంటారు. నిత్యావసర వస్తువులు లిస్టును తయారుచేసినప్పుడు అందులో ఉన్న వస్తువుల పేర్లను పిల్లలతో చదివించవచ్చు. పిల్లలకు ఇష్టమైన వంటకం తయారీ విధానాన్ని వాళ్లతోనే చదివించాలి. నేరుగా కథల పుస్తకాలనే కాకుండా ముందుగా చిన్నచిన్న పదాలను చదవడం అలవాటు చేయాలి. రోడ్డు మీద పెద్ద పెద్ద అక్షరాలతో రాసి ఉండే బోర్డులను చదివిస్తుండాలి. పిల్లలని టీవీ, సినిమా తెరల మీద కనిపించే పేర్లను చదవమనండి. అవి ఇలా పచ్చి అలా మాయమవుతుంటాయి. కాబట్టి వాటిని వేగంగా చదవడం అలవాటవుతుంది.

## కలిసి పనిచేయడం...:

గొడవ పడతారని పిల్లల్ని కలవనీయకుండా చేయ కూడదు. వేర్వేరు పనుల్ని అప్పగించకూడదు. ఇంటికి సంబంధించిన కొన్ని పనులను ఇద్దరూ కలిసి పూర్తిచేసేలా చూడాలి. ఇంటిని శుభ్రంగా ఉంచడం లేదా మొక్కలకు నీళ్లు పోయడం లాంటి తేలికైన పనులు ఇస్తుండాలి. దీనివల్ల కలసిమెలసి పనిచేయడం చిన్నతనం నుంచీ అలవాటవుతుంది. ఏ కాస్త సమయం చిక్కినా పిల్లలతో తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉండాలి. వాళ్ల చిట్టి బుర్రలకు వచ్చే చిన్ని చిన్ని సందేహాలను ఎప్ప టికప్పుడు తీరుస్తుండాలి. కుటుంబమంతా ఒకటేనన్నే భావనను వాళ్ల మనసులో బలంగా నాటాలి. దాంతో చిన్న చిన్న విషయలకు సంకుచితంగా ఆలోచించి గొడవపడడం మానేస్తారు.

## పిల్లల్లో సృజనాత్మక ఎలా పెంచాలి...:

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్.. చిన్నారులకు నచ్చిన విధంగా ఆర్ట్ క్రాఫ్ట్ పాలు పంచుకునేలా చూడండి. వారికి వచ్చిన విధంగా పెయింటింగ్స్ వేయమనండి. "కచ్చితంగా ఇలాగే వచ్చి తీరాలి' అంటూ వారిని ఇబ్బంది పెట్టొద్దు. బొమ్మలు గీయడం, రంగులు వేయడం, స్కెల్ తో రకరకాల బొమ్మలు తయారుచేయడం, కాగితాలతో డిజైన్లు కత్తిరించడం, పూసలు, రాళ్లు, చమ్కీలతో గాజులు, ఇతర వస్తువులు తయారు చేయడం లాంటివి చేయనివ్వండి. ఈ పనులతో వారిలో ఏకాగ్రతతో పాటు సృజనాత్మకత పెరుగుతుంది. రోజూ ఓ పుస్తకం చదివేలా చూడండి. ఇలా చేస్తే పద సంపదతో పాటు ఊహాశక్తి పెరుగుతుంది. చక్కగా రాయగలుగుతారు. ఇంటి పనుల్లో సాయం... ఇంటి పనులు, వంటల్లో చిన్నారుల సాయం తీసుకోండి. కూరగాయలు సర్దడం, కడగడం, ఇల్లు శుభ్రం చేయడం లాంటి చిన్న చిన్న పనులు నేర్పండి. ఇలా చేయడం వల్ల పిల్లలకు సొంతంగా పనులు చేసుకోవడం అలవాటు అవుతుంది. ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది.

## రోగ నిరోధక శక్తి పెంచే ఆహారం పెట్టాలి :

నేటి పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ కు అలవాటు పడి ఉంటారు. అవి తినడం వలన పిల్లల్లో ఊబకాయం పెరిగి ఆరోగ్య సమస్యలు వస్తాయి అని వైద్యులు చెబుతున్నారు. పిల్లలకు ముఖ్యంగా విటమిన్లు, పోషకాహారం ఇవ్వాలి. పాలు, గుడ్లు, ఆకు కూరలు, గింజలు, బాదం, పండ్లు ఎక్కువగా తినేలా వారిని ప్రోత్సహించాలి. అప్పుడే పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది అని వైద్యులు సలహాలు ఇస్తున్నారు. ఏది ఏమైనా నేటి ఆధునిక యుగంలో పిల్లలకి యనభై, తొంభై దశకంలో పెరిగిన పిల్లలకి ఉన్న తేడా అందరికీ తెలిసిందే. పిల్లలు అన్ని రకాలుగా చురుగ్గా ఉండాలంటే పైన తెలిపిన సూచనలను పాటించాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జనం వార్త

# ఏఐతో జాగ్రత్త!

## ఏఐని ఆ ఐదూ అడగొద్దు

మనిషి... మహావేగంగా కృత్రిమ మేధకు అలవాటు పడిపోతున్నాడు. ఆ సలహాల్ని నమ్ముతున్నాడు. ఆ సమయస్ఫూర్తిని మెచ్చుకుంటున్నాడు. ఆ తెలివితేటలకు అబ్బురపడుతున్నాడు. నిజమే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఈ శతాబ్దపు అద్భుతమే. అడిగిన సమాచారాన్ని ఇస్తుంది. కోరిన విషయాల్ని సంభాషిస్తుంది. బొమ్మలు గీస్తుంది. వీడియోలు సృష్టిస్తుంది. బాణీలు కడుతుంది. కోడింగ్ చేస్తుంది. స్క్రీన్‌ప్లేలూ రాస్తుంది. ఎన్ని విన్యాసాలు చేసినా సరే... మనిషికి సాటి రాదు. అతనిలా, సమయం-సందర్భం చూసుకోలేదు. కల్పనలూ వాస్తవాల మధ్య తేడా కనిపెట్టలేదు. నైతికతనూ అనైతికతనూ వేరు చేయడం బొత్తిగా చేతకాదు. కాబట్టే చాట్ జీపీటీ, జెమినీ, గ్రాక్, పర్‌ప్లెక్సిటీ లాంటి ఏఐ టూల్స్‌ను ఉపయోగిస్తున్నప్పుడు ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకోవాలి.

ఏఐ మనిషి లాంటిదే అయినా, మనిషి కాదనే స్పష్టతను పెంచుకోవాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. ఒంట్లో నలతగా ఉన్నా, మనసులో కలతగా అనిపించినా... ఏఐ సాయమే తీసుకుంటున్నారు. ఆర్థిక వ్యవహారాల నుంచి వ్యక్తిగత జీవితాల వరకూ అన్నీ విప్పి చెప్పేస్తున్నారు. కాలక్షేపాలూ, కబుర్ల సంగతి ఎలా ఉన్నా... ప్రత్యేకించి, గోప్యత అనివార్యమైన విషయాల్లో మాత్రం కృత్రిమ మేధను సాధ్యమైనంత దూరం ఉంచడమే మంచిది.

### ఒకటి... వైద్య సలహాలు

కృత్రిమ మేధ... డాక్టరుకు ప్రత్యామ్నాయం కాదు. అది ఎంబీబీఎస్‌లూ, ఎమ్మెస్‌లూ చదవలేదు. అయినా సరే, చాలామంది వ్యక్తిగత వైద్యుడి కిందే జమకట్టేస్తున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా, సలహా కోరుతున్నారు. ప్రిస్క్రిప్షన్ అడుగుతున్నారు. పెద్ద డాక్టర్ దగ్గరికి వెళ్లొచ్చాక కూడా, సెకండ్ ఒపీనియన్ కోసం ఏఐని ఆశ్రయించేవారూ ఉన్నారు. ఆ సమాచారం కనుక నిపుణుడి అభిప్రాయానికి భిన్నంగా ఉంటే, ఏఐ వైపే మొగ్గు చూపుతున్నారు. డాక్టర్‌కు ఏమీ తెలియదంటూ అభాండాలు వేస్తున్నారు. అక్కడితో ఆగకుండా, ఏఐ అప్లికేషన్‌ను పక్కన పెట్టుకుని... అడిగినవాళ్లకూ అడగనివాళ్లకూ వైద్య సలహాలు ఇచ్చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదకరమైన అలవాట్లే.

ఓ మార్కెటింగ్ ఉద్యోగికి తరచూ పొత్తి కడుపులో నొప్పి వచ్చేది. 'ఏ మాత్ర వేసుకుంటే తగ్గుతుంది?' అని ఏఐని అడిగాడు. ఏదో పేరు సిఫార్సు చేసింది. వెంటనే తెప్పించుకున్నాడు. అప్పటికప్పుడు తగ్గినట్టు అనిపించినా, మళ్లీ మళ్లీ వచ్చేది. దీంతో, నెలరోజుల పాటూ ఆ మాత్రల్నే కొనసాగించాడు. ఓరోజు భరించలేనంత నొప్పి ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎమర్జెన్సీ వార్డుకు తరలించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదంతా ఆ మాత్రల దుష్ప్రభావమని పరీక్షల్లో తేలింది. అలా అని, ఇక్కడ ఏఐ పొరపాటూ లేదు. పొత్తి కడుపు నొప్పికి ఆ మాత్రలు బాగానే పని చేస్తాయి. కానీ, గ్యాస్ట్రిక్ అల్సర్లు ఉన్నవారు సదరు ఔషధం జోలికి వెళ్లకూడదు. అయినా, తీసుకుంటే ఇలాంటి విపరిణామాలే ఉంటాయి.



### నాలుగు... ఆర్థిక లావాదేవీలు

ఏ స్టాక్స్ మీద ఇన్వెస్ట్ చేస్తే, ఎంత రాబడి వస్తుంది? టాక్స్ సేవింగ్‌కు తిరుగులేని ఐడియా చెప్పండి? రిటైర్మెంట్ డబ్బును ఏం చేయాలి? రియల్ ఎస్టేట్‌లో పెట్టాలా, బంగారం కొనేయాలా?... ఇలా ఏఐని ఆర్థిక ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటారు చాలామంది. అక్కడితో ఆగకుండా ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా ఊహించుకుని... ఆర్థిక చరిత్రనంతా దాని చేతిలో పెట్టేస్తారు. తాజాగా, దిల్లీకి చెందిన ఓ ఉపాధ్యాయురాలు 'ఐదేళ్లలో నా డబ్బు రెట్టింపు కావాలి. సలహా ఇవ్వండి' అని చాట్బాట్ను అడిగింది. 'అరవై శాతం సొమ్మును ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయండి. మిగతా డబ్బుతో ఫలానా స్టాక్స్ కొనండి' అంటూ కొన్ని పేర్లు కూడా సూచించింది. టీచరమ్మ ఆ ప్రకారంగానే కేటాయింపులు జరిపింది. ఆరునెలలు తిరగేసరికి పరిస్థితులు మారిపోయాయి. ఆమె ఇన్వెస్ట్ చేసిన ఫిన్‌టెక్ కంపెనీ నిబంధనల ఉల్లంఘన కారణంగా నిషేధానికి గురైంది. మరో స్టాక్ పనితీరు కూడా అంతంతమాత్రమే. మ్యూచువల్ ఫండ్స్‌లో నష్టాలు రాలేదు, అలా అని లాభాలూ రాలేదు. ఐదు నెలల్లో నికర నష్టం... లక్ష రూపాయలు.

### రెండు... మానసిక సమస్యలు


ఓ కుర్రాడికి తరచూ ఆత్మహత్య ఆలోచనలు వచ్చేవి. ఏఐ చాట్‌బాట్తోనూ ఆ విషయాలే చర్చించేవాడు. క్రమంగా చనిపోవాలనే ఆలోచన బలపడింది. సూసైడ్ నోట్ తయారీలోనూ ఏఐ సాయం తీసుకున్నాడు. ఓరోజు, అమ్మానాన్నలు లేని సమయం చూసి ఆత్మహత్య చేసుకున్నాడు. గుండెలు పగిలేలా ఏడ్చారు కన్నవాళ్లు. తమ బిడ్డ చావుకు ఏఐ కారణమంటూ కోర్టుకెక్కారు. చాట్‌బాట్ చర్చను సాక్ష్యంగా చూపారు. అమెరికాలో జరిగిన ఈ సంఘటన... భారత్‌కూ ఓ ప్రమాద హెచ్చరికే. ఇప్పటికే, యూఎస్‌లోని ఇల్లినోయీ సర్కారు 'కృత్రిమ' కౌన్సెలింగ్ సేవల మీద కొరడా ఝుళిపించింది. మార్కెట్‌లోని ఏఐ ఆధారిత మెంటల్ హెల్త్ అప్లికేషన్ల విశ్వసనీయత విషయంలో భారతీయ సైకాలజిస్టులూ అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మానసిక వైద్యం చాలా సున్నితమైన వ్యవహారం. రోగి సమస్యల్ని వింటున్నప్పుడు... నిపుణుడి కళ్లూ, చెవులూ, మెదడూ, హృదయమూ సమన్వయంతో పనిచేస్తాయి. వైద్యులు ఆ స్వరంలోని హెచ్చుతగ్గులను గమనిస్తారు, శరీర భాషను విశ్లేషిస్తారు, ఉద్వేగాలను అర్థం చేసుకుంటారు. కనురెప్పల కదలికలు కూడా ఏదో ఓ సంకేతాన్ని అందిస్తాయి. ఏఐ ఇలాంటి భావోద్వేగాల్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు. దీంతో, ఏదో ఓ కోణంలోంచి మాత్రమే సలహా ఇస్తుంది. ఆ బేరీజు అసమగ్రం, అశాస్త్రీయం కూడా. అందులోనూ, జెన్-జడ్ 'చాట్బాట్ థెరపీ' మీద ఎక్కువగా ఆధారపడుతోంది. ఒత్తిడి, ఒంటరితనం, ప్రేమరాహిత్యం, వైఫల్యాలు... ఇలా రోజువారీ జీవితంలోని మానసిక సమస్యల పరిష్కారానికి ఏఐని ఆశ్రయిస్తోంది. కౌమార లక్షణాల్లో బిడియమూ ఒకటి. ఆ మితిమీరిన మొహమాటం కారణంగా వాళ్లు, మనసులోని ఇబ్బందుల్ని బయటికి చెప్పుకోలేరు. ధైర్యంగా వెళ్లి వైద్యమూ చేయించుకోలేరు. తక్షణ సాయం కోసం సెల్‌ఫోన్‌లోని చాట్‌బాట్ వైపే చూస్తారు. కొన్నిసార్లు ఆ సలహాలు వికటిస్తాయి. మరింత పెద్ద సమస్య వైపు లాక్కెళ్తాయి. అమ్మానాన్నల గురించి ఫిర్యాదులూ, క్లాస్-రూమ్‌లో జరిగిన సంఘటనలూ, మనసులోని ఇష్టాయిష్టాలూ... ఇలా ప్రతి విషయాన్నీ రోజూ ఏఐతోనే పంచుకోవడం వల్లా, గంటల తరబడి సంభాషించడం వల్లా... క్రమంగా వాటినే ఆత్మీయుల్లా భావించడం మొదలుపెడతారు. ఏఐని బాయ్‌ఫ్రెండ్‌లా ఊహించుకునే అమ్మాయిలూ, గాళ్‌ఫ్రెండ్‌లా ఆరాధించే అబ్బాయిలూ చాలామందే ఉన్నారు. 'చిన్నా' అనో, 'బంగారం' అనో ముద్దు పేర్లూ పెట్టుకుంటున్నారు. ఈ ధోరణికి 'ఏఐ సైకోసిస్' అని పేరు పెట్టారు పరిశోధకులు.

### మూడు... వ్యక్తిగత విషయాలు

కొన్నింటిని పదిమందితో చర్చిస్తాం. కొన్నింటిని ఒకరితోనో ఇద్దరితోనో ప్రస్తావిస్తాం. కొన్నింటిని మాత్రం మనసులోనే మురగబెట్టుకుంటాం. అవన్నీ తెలియక చేసిన తప్పులు కావచ్చు, తొందరపాటు నిర్ణయాలు కావచ్చు, అపరాధ భావాలూ కావచ్చు. గుండె లోతుల్లోని రహస్యాల్ని చెప్పేసుకుని, మనసును తేలిక పరుచుకోడానికి నమ్మకమైన మనుషులెవరూ లేనప్పుడు... ఉద్వేగపరమైన మద్దతు కోసం ఏఐ మీదే ఆధారపడాల్సి వస్తోంది. అంతవరకూ ఎందుకు, చిన్నచిన్న అనుభూతుల గురించి మాట్లాడుకుందామన్నా, ఓపిగ్గా వినే మనిషి కనిపించడం లేదు. ఎవరి పరుగు వారిదైపోయింది మరి. మీరు కోల్పోతున్న ఆ మానసికమైన మద్దతును మేం అందిస్తామంటూ 'కంపానియన్ స్టార్టప్స్' రంగంలోకి దూకుతున్నాయి. దాదాపుగా ఓ నేస్తంలా స్పందించే 'కృత్రిమ' సాంకేతికతను రకరకాల పేర్లతో అందిస్తున్నాయి. మొదట్లో ఇదంతా బాగానే అనిపించినా, దీర్ఘకాలంలో తీవ్ర వ్యసనంగా మారిపోతుంది. మనల్ని పరాధీనులుగా మార్చేస్తుంది. ఏఐ కంపెనీలు త్వరలోనే సెక్స్ చాట్ అప్లికేషన్లనూ తీసుకొస్తున్నాయి. వాటిని వయోజనుల కోసమే అందిస్తున్నామని చెబుతున్నా, కౌమారమే తొలి లక్ష్యం కావచ్చు. వీటి గోప్యత విషయంలోనూ అనేక సందేహాలు ఉన్నాయి. సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడుతుందనే సాకుతోనో, యాప్ పనితీరును మెరుగుపరుచుకోడానికి పనికొస్తుందనే కారణంతోనో ఆయా కంపెనీలు మన చర్చల్నీ, సంభాషణల్నీ భద్రంగా దాచుకుంటున్నాయి. ఒక్కసారి ఎంటర్ కొడితే చాలు... మనం టైప్ చేసిన సమాచారమంతా చేయి దాటిపోతుంది. ఫొటో, వీడియో, స్వరం, పేరు, చిరునామా, ఫోన్ నంబరు... దేని భద్రతకూ భరోసా ఉండదు. కొన్నాళ్ల క్రితం, 'చాట్ జీపీటీ బగ్' కారణంగా ఒకరి చాట్ హిస్టరీ మరొకరికి వెళ్లిపోయింది. భవిష్యత్తులో ఇంతకంటే తీవ్రమైన బగ్ రావచ్చు. ఆ పరిణామాలు మరింత తీవ్రంగానూ ఉండొచ్చు. దీనివల్ల బజారున పడేది అమాయకుల జీవితాలే. ఇప్పటికే బాలీవుడ్ సెలబ్రిటీలు తమ 'ఆన్‌లైన్ ఐడెంటిటీ' విషయంలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి గండాలే సామాన్యుల జీవితాలకూ పొంచి ఉన్నాయి. కాబట్టి, మన జాగ్రత్తలో మనం ఉండాలి. వ్యక్తిగత విషయాల్ని అత్యంత ఆత్మీయులకే పరిమితం చేయాలి. పూర్తి పేర్లూ, పాస్‌వర్డ్‌లూ పుట్టిన తేదీలూ మొదలుకొని ఏ వ్యక్తిగత వివరాన్నీ ఏఐ చాట్‌లలో ప్రస్తావించకూడదు. డౌన్‌లోడ్ దశలోనే ప్రైవసీ పాలసీని చదువుకోవాలి. ఫోన్‌లో సెట్టింగ్స్‌నూ మార్చుకోవాలి.

### ఐదు... న్యాయ సలహాలు

అదేదో సినిమాలో ఓ పాత్ర... నిజాలు చెప్పే యంత్రాన్ని అబద్ధాలతో పరీక్షించినట్టు, తమ తెలివితేటలతో చాట్‌బాట్‌ను ముప్పుతిప్పలు పెట్టాలని ఉబలాటపడేవారూ ఉన్నారు. అడుగు ముందుకేసి... ఆ సాంకేతికతను అనైతిక చర్యలకు వాడుకోవాలనుకునే వారి సంఖ్యా తక్కువేం కాదు. ఇంటర్నెట్ మీద ఇంటెలిజెన్స్ సంస్థలు ఓ కన్నేసి ఉంచుతాయి. ఆ చర్చలూ, సంభాషణల్లోని కీలక పదాలూ సందేహాస్పదంగా అనిపిస్తే, వెంటనే రంగంలోకి దిగిపోతాయి. వివాదాస్పద అంశాల మీద మన వ్యాఖ్యల్ని కొన్ని సందర్భాల్లో కోర్టులు సాక్ష్యాలుగానూ పరిగణిస్తాయి. కాబట్టి, చాటింగ్ సమయంలో జాగ్రత్తపడాలి. చట్టాల విషయంలోనూ ఏఐ సలహాను గుడ్డిగా నమ్మలేం. ఇటీవల, దిల్లీ హైకోర్టులో ఓ న్యాయవాది ఏఐ సాయంతో సేకరించిన వివరాల్లో... కల్పితమైన కేస్‌స్టడీ ఉన్నట్టు న్యాయమూర్తి గుర్తించారు. ఆ లాయరుకు బాగానే అక్షింతలు పడ్డాయి. న్యాయ సలహాల విషయంలో ఏఐని సంప్రదించే వారికి ఇదొక హెచ్చరిక.



# పొట్టి కప్పులో ముగిసిన
# భారత అమ్మాయిల కథ

## ఆస్ట్రేలియా చేతిలో ఓటమి

**లార్డ్స్ :** మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీస్ కూడా చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది హర్మన్‌ప్రీత్ సేన. నాకౌట్ చేరాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో ఆదివారం భారత్ 6 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మొదట భారత్ 4 వికెట్లకు 170 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ (56; 27 బంతుల్లో 6x4, 3x6) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడినా, షెఫాలి (34; 26 బంతుల్లో 3x4, 2x6) కూడా మెరిసినా.. స్మృతి మంధాన (38; 37 బంతుల్లో 6x4), జెమీమా రోడ్రిగ్స్ (34; 28 బంతుల్లో 1x4, 1x6) మరీ నెమ్మదిగా ఆడడంతో భారత్ అవసరమైన దాని కంటే తక్కువ స్కోరే చేసింది. అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎలీస్ పెర్రీ (56; 38 బంతుల్లో 8x4), ఆష్లీ గార్డ్‌నర్ (53 నాటౌట్; 29 బంతుల్లో 3x4, 3x6) మెరుపులతో లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. స్పిన్నర్ శ్రీ చరణి (2/32) మరోసారి మెరిసినా.. జట్టును గెలిపించలేకపోయింది. గ్రూప్-1 నుంచి ఆస్ట్రేలియా (10 పాయింట్లు), దక్షిణాఫ్రికా (8) సెమీస్ చేరాయి. గ్రూప్-2 నుంచి ఇంగ్లాండ్ (10), వెస్టిండీస్ (6) ముందంజ వేశాయి.

లక్ష్యం మరీ పెద్దది కాకపోయినా.. భారత్ గెలవడానికి మంచి అవకాశాలే కనిపించాయి. ఛేదనలో ఆసీస్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. రెండో బంతికే జార్జియా వోల్ (4)ను రేణుక వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌కు శుభారంభాన్నిచ్చింది. అయితే బెత్ మూనీ (22), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (24) నిలవడంతో ఆసీస్ 54/1తో పుంజుకుంది. టోర్నీలో అద్భుత ప్రదర్శన చేస్తున్న తెలుగమ్మాయి శ్రీ చరణి.. బంతి అందుకోగానే ఫలితం రాబట్టి భారత్‌ను పోటీలోకి తెచ్చింది. ప్రమాదకర లిచ్‌ఫీల్డ్‌ను ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఔట్ చేసింది. కాసేపటికే బెత్ మూనీని మరో స్పిన్నర్ దీప్తి ఔట్ చేయడంతో ఆసీస్ ఇబ్బందుల్లో పడింది. పిచ్ నెమ్మదిగా ఉండి, బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో స్పిన్నర్లు బాగా ఉపయోగించుకుని ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టారు. 12 ఓవర్లకు స్కోరు 85/3. 8 ఓవర్లలో 86 పరుగులు చేయాల్సి రావడంతో భారత్‌కు మెరుగైన అవకాశాలున్నట్లే కనిపించింది. కానీ మేటి బ్యాటర్లయిన పెర్రీ, ఆష్లీ ఒత్తిడిని ఒక్కసారిగా భారత్ మీదికి మళ్లించేశారు. రాధ యాదవ్ వేసిన 13వ ఓవర్లో ఆష్లీ 4, 6 బాదగా.. పెర్రీ ఒక ఫోర్ కొట్టింది. ఈ ఓవర్లో 17 పరుగులు రావడంతో ఆసీస్ బలంగా పోటీలోకి వచ్చింది. 15 ఓవర్లో శ్రీ చరణి సైతం 16 పరుగులు సమర్పించుకోవడంతో సమీకరణం 30 బంతుల్లో 46 పరుగులతో అందుబాటులోకి వచ్చింది. రేణుక 17వ ఓవర్లో పేలవంగా బౌలింగ్ చేసి 17 పరుగులు ఇచ్చుకోవడంతో మ్యాచ్ భారత్ చేజారింది. ఇన్నింగ్స్ ద్వితీయార్ధంలో బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్ కూడా పేలవంగా సాగడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. మ్యాచ్ చేతిలోకి వచ్చాక పెర్రీ ఔట్ కాగా.. 19వ ఓవర్ చివరి బంతికి ఫోర్ కొట్టిన జార్జియా మ్యాచ్‌ను ముగించింది.



## కావ్య మారన్‌తో అనిరుధ్ పెళ్లి..!

### ఆసక్తికర విషయం పంచుకున్న నటుడు



సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సీఈవోగా వ్యవహరిస్తున్న కావ్య మారన్ కొంతకాలంగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లోనూ చర్చ జరిగింది. ఈ ప్రచారాన్ని అనిరుధ్ ఖండించారు. అయితే, తాజాగా వీరి వివాహం గురించి మరో వార్త బయటికొచ్చింది. అనిరుధ్, కావ్య మారన్ త్వరలో పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని అనిరుధ్‌కు బంధువైన సీనియర్ నటుడు వై.జీ. మహేంద్రన్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. వీరి పెళ్లికి ఇరుకుటుంబాల పెద్దలు కూడా ఓకే చెప్పినట్లు తెలిపారు. "అనిరుధ్ మృదు స్వభావి. నాకు తెలిసినంతవరకు వాళ్లిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారు. ఆ అమ్మాయి ఆర్డినరీ గర్ల్ కాదు. అంత పెద్ద జట్టును నిర్వహించగల సామర్థ్యం ఆమెకు ఉంది. ఆమె తన తండ్రి నుంచి వ్యాపార నైపుణ్యాలను పుణికిపుచ్చుకుంది. అనిరుధ్, కావ్య మారన్ మంచి జంట" అని పేర్కొన్నారు. కావ్య.. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో మైదానంలో తనదైన హావభావాలతో పాపులర్ అయ్యారు. కళానిధి మారన్ నిర్మించిన 'జైలర్', 'బీస్ట్', 'రాయన్' తదితర చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించారు.

## ఉత్కంఠ పోరులో కరీంనగర్‌దే విజయం



**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో కరీంనగర్ డైమండ్స్ బోణీ చేసింది. ఆదివారం వరంగల్ వారియర్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. 210 పరుగుల లక్ష్యఛేదనలో వరంగల్ 6 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసింది. రిషికేత్ సిసోదియా (65; 31 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సులు), భవేశ్ సేథ్ (53; 27 బంతుల్లో 6 సిక్సులు) పోరాడినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. హర్షిత్ చౌదరి (31), శౌనక్ కులకర్ణి (14) పరుగులు చేశాడు. కరీంనగర్ బౌలర్లలో సతీష్ కుమార్ 2 వికెట్లు పడగొట్టాడు. శుభమ్ శర్మ, దినేశ్, హరీశ్ ఠాకూర్, ఆశిష్ శ్రీవాస్తవ్ తలో వికెట్ తీశారు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసింది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (133; 61 బంతుల్లో 15 ఫోర్లు, 7 సిక్సులు) 'శత'క్కొట్టాడు. ఓపెనర్ సాత్విక్ రెడ్డి (4) తొలి ఓవర్‌లోనే వెనుదిరిగినా.. తన్మయ్ మిగతా బ్యాటర్ల సాయంతో ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 27 బంతుల్లో హాఫ్ సెంచరీ, 52 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. హృషికేశ్ సింహ (24), చందన్ సహాని (16), రాహుల్ రాదేశ్ (15లి) పరుగులు చేశారు. వరంగల్ బౌలర్లలో ముదస్సర్ హుస్సేన్ 2, ఆది మణి కిరణ్, శౌనక్ కులకర్ణి, మురుగన్ అభిషేక్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## రెండో టీ20లోనూ భారత్ ఓటమి

### ఐర్లాండ్‌దే సిరీస్

బ్యాటింగ్ వైఫల్యం కొనసాగిన వేళ ఐర్లాండ్‌తో చివరిదైన రెండో టీ20లో భారత్ ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. మొదట ఐర్లాండ్ 8 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసింది. హ్యారీ టెక్టార్ (53; 47 బంతుల్లో 5x4, 1x6) రాణించాడు. అరంగేట్ర పేసర్ ప్రిన్స్ యాదవ్ (3/22) ఆ జట్టు కట్టడిలో కీలక పాత్ర పోషించాడు. అర్ష్‌దీప్ (2/35), శివమ్ దూబె (2/25), హర్షిత్ రాణా (1/17) రాణించారు. ఛేదనలో భారత్ 9 వికెట్లకు 153 పరుగులే చేయగలిగింది. తిలక్ వర్మ (55; 46 బంతుల్లో 3x4, 1x6) ఒక్కడే రాణించాడు. భారత







సంతతి ఆటగాడు జై ముంద్రా (3/32), హోలార్డ్ (3/26) విజృంభించారు. ఈ విజయంతో సిరీస్‌ను ఐర్లాండ్ 2-0తో చేజిక్కించుకుంది. భారత్‌పై ఏ ఫార్మాట్లోనైనా సిరీస్ నెగ్గడం ఆ జట్టుకు ఇదే తొలిసారి. 16 వరుస టీ20 సిరీస్ విజయాల తర్వాత భారత్‌కిదే తొలి ఓటమి. ప్రిన్స్‌తో పాటు ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్జే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు. వైభవ్‌కు అవకాశం దక్కలేదు.

ఛేదనలో భారత్ తడబడింది. విధ్వంసక ఓపెనర్లు సంజు శాంసన్, అభిషేక్ శర్మ తొలి ఓవర్లోనే డకౌటవగా.. మూడో ఓవర్లో కెప్టెన్ శ్రేయస్ (10) వెనుదిరిగాడు. ఈ ముగ్గురిని జై ముంద్రా ఔట్ చేశాడు. 5వ ఓవర్లో ఇషాన్ కిషన్ (12) రనౌట్ కావడంతో 35/4తో చిక్కుల్లో పడింది. ఆ దశలో తిలక్ వర్మ నిలబడ్డాడు. అక్షర్ (14)తో 39 పరుగులు జోడించి ఇన్నింగ్స్ ను చక్కదిద్దిన తిలక్.. అతడు ఔటయ్యాక దూబె (20) తో కలిసి పోరాటాన్ని కొనసాగించాడు. 16 ఓవర్లలో 109/5తో భారత్ రేసులో నిలిచింది. కానీ తర్వాతి ఓవర్లో హంఫ్రీస్ 2 పరుగులే ఇచ్చి దూబెను ఔట్ చేయడం.. హోలార్డ్ ఒకే ఓవర్లో తిలక్, షెడ్జే (1)లను వెనక్కి పంపడంతో టీమ్ఇండియా వెనుకబడిపోయింది. 19వ ఓవర్లో హర్షిత్ (21) వరుసగా ఫోర్, సిక్స్ కొట్టాడు. ఆఖరి ఓవర్లో 20 పరుగులు అవసరమయ్యా యి. తొలి రెండు బంతుల్లో 9 పరుగులు రావడంతో ఆశలు రేగినా.. చివరికి ఓటమి తప్పలేదు. 2 బంతుల్లో 8 పరుగులు చేయాల్సిరాగా హర్షిత్ ఔటవగా.. చివరి బంతికి ప్రిన్స్ సిక్స్ కొట్టినా ఫలితం లేకపోయింది.

## అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించిన బెన్ స్టోక్స్

ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టు మ్యాచ్ తన కెరీర్‌లో చివరిదని ప్రకటించాడు. ఈ మ్యాచ్‌కు ముందు రిటైర్‌మెంట్ ప్రకటించిన స్టోక్స్.. ఆ వార్త ప్రపంచానికి తెలిసిన కొద్దిసేపటికే.. తన ఖాతాలో మరో వికెట్ వేసుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో తొలి బంతికే జాక్ ఫాక్స్ వికెట్ దక్కించుకున్నాడు. లండన్ వేదికగా జరిగిన రెండో టెస్టులో బెన్‌స్టోక్స్ ఆడలేదు. ఆ తర్వాత ప్రస్తుతం నాటింగ్‌హామ్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌కు సారథ్యం వహిస్తున్నాడు. మరో వారం రోజులే జట్టులో ఉంటానని అప్పుడే చెప్పినట్లు తెలుస్తోంది. రిటైర్‌మెంట్ ప్రకటించడానికి ముందు డ్రెస్సింగ్ రూమ్‌లో స్టోక్స్ భావోద్వేగానికి గురయ్యాడు. "రిటైర్‌మెంట్ కారణాల గురించి తర్వాత చెప్పొచ్చు. కానీ, ఈ జట్టు కోసం నేను చాలాసార్లు కష్టపడ్డాను. ఇప్పుడు మరోసారి కష్టపడాల్సి ఉంది. మనం చాలా కష్టపడాలి. ఫలితం ఎలా ఉన్నా శక్తి వంచన లేకుండా పని చేశామన్న సంతృప్తితో మైదానం విడిచి రావాలి. అదే నా కోరిక" అంటూ మ్యాచ్ ప్రారంభానికి ముందు జట్టు సభ్యులతో బెన్‌స్టోక్స్ వ్యాఖ్యానించాడు. 15 ఏళ్లపాటు ఇంగ్లాండ్ జట్టుకు సేవలందించిన స్టోక్స్.. తన కెరీర్‌లో 122 టెస్టులు ఆడగా.. 44 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. 114 అంతర్జాతీయ వన్డేలు, 43 టీ20లు ఆడాడు. 2022 టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించాడు.





# ఆ ఆఫర్‌ను తిరస్కరించినందుకు సంతోషంగా ఉంది

నాగ్ అశ్విన్ దర్శకత్వంలో పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా వచ్చిన సినిమా 'కల్కి'. ఈ మూవీ విడుదలై బాక్సాఫీసు వద్ద సంచలన రికార్డ్ సృష్టించిన విషయం తెలిసిందే. సినిమాలో దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాలు నటించగా, స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ కూడా ఒక కీలక పాత్రలో భాగమయ్యారు. సినిమాలో నేరుగా కనిపించకపోయినప్పటికీ.. తన వాయిస్‌తో 'బుజ్జి' పాత్రకు ప్రాణం పోసి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నారు. తాజాగా ఈ సినిమా విడుదలై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి సురేష్ 'కల్కి'లో తాను భాగమవ్వడం వెనుక ఉన్న కొన్ని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. నాగ్ అశ్విన్ మొదట ఈ సినిమాలో బుజ్జి పాత్ర కాకుండా మరో క్యారెక్టర్ చేయమని అడిగారని కీర్తి సురేష్ తెలిపారు. అయితే ఆ పాత్ర విన్నప్పుడు తనకు ఎందుకో అంతగా నమ్మకం కలగలేదని, అందుకే దానికి నో చెప్పానని వివరించారు. కానీ ఆ తర్వాత రోజే నాగ్ అశ్విన్ మళ్లీ ఫోన్ చేసి, తన వద్ద మరో అద్భుతమైన పాత్ర ఉందని, కనీసం అదైనా చేస్తావా అని అడిగారని చెప్పారు. ఆయన సినిమాలో కచ్చితంగా ఏదో ఒక విధంగా తాను భాగమవుతానని తనకు ముందే తెలుసని కీర్తి పేర్కొన్నారు. నిజానికి మొదట వచ్చిన ఆఫర్‌ను తిరస్కరించినందుకు తనకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉందని, ఒకవేళ దానికి ఓకే చెప్పి ఉంటే తనకు ఇంతటి గుర్తింపు తెచ్చిన 'బుజ్జి' పాత్ర దక్కేది కాదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. నాగ్ అశ్విన్ రెండోసారి బుజ్జి పాత్ర గురించి చెప్పినప్పుడు కేవలం వాయిస్ అందిస్తే చాలని అన్నారని కీర్తి సురేష్ గుర్తుచేసుకున్నారు. దాంతో తనకు ఏమీ అర్థం కాక, తాను షూటింగ్‌కు రావాల్సిన అవసరం లేదా అని ఆయన్ని అడిగినట్లు చెప్పారు. దానికి నాగ్ అశ్విన్ స్పందిస్తూ.. షూటింగ్ ఏమీ అవసరం లేదని, కేవలం నీ వాయిస్ మాత్రమే కావాలని అనడంతో తనకు చాలా సంతోషంగా అనిపించిందని, అదే సమయంలో కొంత ఆశ్చర్యానికి, షాక్‌కు గురయ్యానని తెలిపారు. సినిమాలో నటించకుండా కేవలం గొంతుతో క్యారెక్టర్‌ను పండించడం అనేది సరికొత్తగా అనిపించడంతో, తాను వెంటనే ఈ బుజ్జి పాత్రకు ఓకే చెప్పానని కీర్తి సురేష్ వివరించారు.



# కళ్యాణి ప్రియదర్శన్ కిల్లింగ్ ఎక్స్‌ప్రెషన్స్

నటి కళ్యాణి ప్రియదర్శన్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. తెలుగు సహా పలు భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఈ బ్యూటీ, నటిగా మంచి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'లోకా: ఛాప్టర్ 1 - చంద్ర' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఈ మూవీ సక్సెస్‌తో కళ్యాణి ప్రియదర్శన్‌కు మరింత క్రేజ్ పెరిగింది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా కెరీర్‌ను కొనసాగిస్తోంది. కెరీర్ ప్రారంభించి చాలా కాలమైనప్పటికీ కళ్యాణి ప్రియదర్శన్ ఎప్పుడూ గ్లామర్ షోకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలేదు. సినిమాల్లోనే కాదు, సోషల్ మీడియాలోనూ హద్దులు దాటకుండా తనదైన శైలిలో అభిమానులను ఆకట్టుకుంటూ వస్తోంది. అయితే తాజాగా ఆమెకు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోల్లో రంగురంగుల డ్రెస్‌లో మెరిసిపోయిన కళ్యాణి, చున్నీని చేతిపై వేసుకుని తన నడుము అందాలు హైలైట్ అయ్యేలా స్టైలిష్ పోజులు ఇచ్చింది. ముఖంపైకి, వెనుకకు జారేలా వదిలిన జుట్టు, చెవులకు ధరించిన భారీ ఇయర్‌రింగ్స్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. కిల్లింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కళ్యాణి ఇచ్చిన ఈ స్టిల్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతున్నాయి.

# కెరీర్ స్టార్టింగ్‌లో ఎన్నో కష్టాలు పడ్డా

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్-2' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రస్తుతం తెలుగులో ఓ బంపర్ ఆఫర్ అందుకున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. విజయ్ దేవరకొండ, శౌర్యువ్ కాంబోలో రాబోతున్న పాన్ ఇండియా మూవీలో కృతి కీలక పాత్రలో కనిపించనున్నట్లు టాక్. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతి సనన్.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న కృతీ సనన్, సినిమా ఇండస్ట్రీలో తన 12 ఏళ్ల ప్రయాణం గురించి చెప్తూ చాలా ఎమోషనల్ అయ్యారు. ఇక్కడి దాకా రావడం తనకు అస్సలు ఈజీగా సాగలేదని, కెరీర్ స్టార్టింగ్‌లో ఎన్నో కష్టాలు పడ్డానని చెప్పారు. తన మోడలింగ్ రోజులను గుర్తుచేసుకుంటూ.. తన మొదటి ఫొటోషూట్, మొదటి ర్యాంప్ షో రెండూ ఘోరంగా ఫ్లాప్ అయ్యాయని, ఆ రెండు సార్లు తాను ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చానని కృతి ఎమోషనల్ అయ్యారు. అయినప్పటికీ పట్టుదలతో మళ్లీ ఆడిషన్స్‌కు వెళ్లానని, ఆ మొండితనమే తనను ఈరోజు ఇక్కడి దాకా తెచ్చిందని అన్నారు. అంతేకాకుండా బాలీవుడ్‌లో ఉన్న నెపోటిజంపై కూడా కృతి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ లాంటి స్టార్ కిడ్స్‌కు మంచి టాలెంట్ ఉందని, వారికి అవకాశాలు చాలా ఈజీగా వచ్చినా వారు కష్టపడి నటనను నిరూపించుకున్నారని ఆమె చెప్పారు. కానీ, అస్సలు టాలెంట్ లేకపోయినా కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉందనే ఒకే ఒక్క కారణంతో కొంతమందికి ఎనిమిది, తొమ్మిదేళ్ల పాటు వరుసగా ఛాన్స్‌లు ఇవ్వడమే అన్యాయమని కృతి మండిపడ్డారు. సినిమా బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు గనుక మొదటి రెండు మూడేళ్లలోనే హిట్లు కొట్టి తమను తాము నిరూపించుకోకపోతే, ఈ ఇండస్ట్రీ వాళ్లను పూర్తిగా పక్కన పెట్టేస్తుందని కృతి సనన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com